క్లుప్తంగా

పాఠశాల సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలి

ఒంగోలు: ప్రభుత్వంలో విలీనమైన ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పాఠశాల సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 2022 మార్చి నెలలో 123 మంది ఎయిడెడ్ ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోకి సర్దుబాటు అయ్యారన్నారు. 2023 ఫిబ్రవరి నెలలో 15 మంది విలీనమైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల రేషనలైజేషన్‌లో పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలో 2022 మార్చిల చేరిన ఉపాధ్యాయులను 2023 జూన్ నెలల చేరిన ఉపాధ్యాయుల కంటే సీనియార్టీగా పరిగణించి వారి సర్వీసును పాఠశాల సీనియార్టీగా పరిగణించి సర్దుబాటు చేయాలన్నారు. 2023 జూన్ నెలలో చేరిన వారిని జూనియర్స్‌గా గుర్తించాలని, విలీనమైన తేదీని పరిగణనలోకి తీసుకుని కౌన్సిలింగ్ నిర్వహించాలని డీఈవో వీఎస్ సుబ్బారావు, మండల విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రేపు విజయవాడలో నిరసన

ఒంగోలు: సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం, జీవో ఎంఎస్ నెంబర్ 117ని రద్దు చేయాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు సమస్యలు పరిష్కారంతో ప్రాథమిక విద్యారంగాన్ని పరిరక్షించుటకు ఫ్యాప్టో రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో ఈ నెల 23న జరిగే 12 గంటల నిరసన ధర్నా జయప్రదం చేయాలని ఆ సంఘ రాష్ట్ర బాధ్యులు వై.శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమికి ప్రత్యేక పూజలు

ఒంగోలు మెట్రో: శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రీకృష్ణ జయంతి పండగ పర్వదిన మహోత్సవం సందర్భంగా స్థానిక మస్తాన్ దర్గా సెంటర్ శ్రీకృష్ణ దేవాలయంలో సెప్టెంబర్ 6,7 తేదీల్లో ఉదయం 5:30 గంటలకు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో కృష్ణ భగవానునికి మేలుకొలుపు, సుప్రభాతం, మహాగణపతి పూజ, 6 గంటల నుంచి 9 గంటల వరకు శ్రీకృష్ణుని మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, వేదపండితులు అనుమతితో భక్తులు, మహిళలు, స్వయంగా అమృత హస్తాలతో అభిషేకం చేసుకొనే అవకాశం వేద పండితులు కల్పిస్తారు. ఈ సదావకాశం వినియోగించుకుని వారి కుటుంబ సభ్యుల గోత్రం నామాలతో ప్రత్యేక పూజలు జరుపుకొని స్వామివారి తీర్థప్రసాదం వినియోగంలో పాల్గొని వేద పురోహితులచే వేద ఆశీర్వచనం తీసుకోవాలి. రాత్రి 6 గంటల నుంచి విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేక పూజ జరుగుతుంది. రాత్రి 8 గంటలకు గోకుల శ్రీకృష్ణ జయంతి ఉట్టి మహోత్సవం కనుల పండుగా జరుగుతుంది. సెప్టెంబర్ 7న గురువారం ఉదయం 6 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత గోపాలకృష్ణుడు నగరోత్సవం జరుగుతుంది. మహోత్సవం వేడుకలను జయప్రదం చేయాలని గోపాలకృష్ణ భగవాన్ మందిర నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలు సబర్బన్: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఒంగోలు పట్టణ విద్యుత్ శాఖ డీఈఈ జి.వినయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో 33/11 ఓల్డ్ రిమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో మున్సిపల్ ఆఫీస్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. కొండపై నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మిస్తున్నందున నూతనంగా విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. శివాలయం సెంటర్, లాయరుపేట, మున్సిపల్ ఆఫీసు ఏరియా, కోర్టు సెంటర్, రాజాపానగల్ రోడ్డు, లేబర్ ఆఫీసు ఏరియా, గాంధీ రోడ్డు, ప్రకాశం భవన్, ట్రంక్ రోడ్డు, ఏనుగు చెట్టు ఏరియాలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. అందుకోసం మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు మంత్రి సురేష్ పర్యటన



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సచివాలయం-1

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువులో రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీడీవో మరియదాసు తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక జెడ్పీ పాఠశాలలో కోటి 18 లక్షల రూపాయలతో నిర్మించిన అదనపు తరగతి గదులను ప్రారంభించడం, అనంతరం రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయ-1, 2 నూతన భవనాలను ప్రారంభించడం, తర్వాత ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కంచర్ల వీరయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంతరం 5 గంటలకు గడప గడపకు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పని సరిగా హాజరు కావాలని వారు కోరారు.

కమిషనర్ స్పందనకు 15 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 15 మంది తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. వారి సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 5 అర్జీలు, శానిటేషన్ విభాగానికి సంబంధించి 4 అర్జీలు, రెవెన్యూ విభాగానికి సంబంధించి 3, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 3 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. అందుకే వచ్చిన అర్జీలను ఆయా విభాగాలకు చెందిన అధికారులకు పంపించి నిర్ణీత గడువులో వాటిని పరిష్కరించాలని ఆదేశించామన్నారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల తమ సమస్యలను ఉదయం 10 గంటలకల్లా కార్యాలయానికి వచ్చి అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ నిర్వహించిన స్పందన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఒంగోలు నగర పాలక సంస్థకు సంబంధించిన విషయాలను ఆయన కలెక్టర్‌కు వివరించారు. ఒంగోలు నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మనోహర్ రెడ్డితో పాటు ఒంగోలు నగర పాలక సంస్థకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఎంపీ మాగుంటకు సత్కారం



సత్కారం పొందుతున్న ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు: అమృత్ భారత్ స్టేషన్ పథకం పురోగతిపై ఎస్టిమేట్స్ కమిటీ సభ్యులు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి సోమవారం అధికారులు, కమిటీ చైర్మన్ డాక్టర్ సంజయ్ జైశ్వాల్, ఇతర సభ్యులతో కలిసి అధ్యయన కార్యక్రమంలో పాల్గొన్నారు. చెన్నైలోని హోటల్ ట్రైడెంట్ సమావేశ మందిరంలో రైల్వే మంత్రిత్వ శాఖ , సదరన్ రైల్వే అధికారులు, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమై చర్చలు జరిపారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం పురోగతికి ప్రభుత్వ ప్రతినిధులు చేసిన సూచనలపై తీసుకోవాల్సిన చర్యలు, సదుపాయాల ఏర్పాటు గురించి రైల్వే మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేస్తామని అధికారులకు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, మిగితా కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టిమేట్స్ కమిటీ సభ్యునిగా పాల్గొన్న ఎంపీ మాగుంటను అధికారులు అభినందిస్తూ సత్కరించారు.

కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ



కానిస్టేబుల్ రత్నబాబును అభినందిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు సిటీ: గోవాలో అక్టోబర్ 25 నుంచి నవంబరు 9వ తేదీ వరకు నిర్వహించనున్న 37వ నేషనల్ గేమ్స్‌కు అర్హత సాధించిన ఒంగోలు తాలుకా పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ డీఎస్‌బీ రత్నబాబును సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన పెన్‌కాక్ సిలాట్ ట్రయల్ పోటీల్లో పోలీస్ శాఖ తరఫున పాల్గొన్న రత్నబాబు టాప్-5లో నిలిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మలికా గర్గ్ మాట్లాడుతూ.. ఒక వైపు పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూనే మరో వైపు క్రీడలపై ఉన్న ఆసక్తితో నిరంతర సాధన చేస్తూ జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. నేషనల్ గేమ్స్‌లో పతకాలు సాధించి రాష్ట్ర పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి ఆరాధన మహోత్సవాలు

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేటలో వేంచేసి ఉన్న గొలగమూడి వెంకయ్య స్వామి 41వ ఆరాధన మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు ఆర్.సాంబశివరావు తెలిపారు. స్వామి ఆరాధనలో మొదటి రోజు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు బుధవారం ఉదయం 6 గంటల వరకు మైనంపాడు భజన బృందంచే ఓం నారాయణ ఆది నారాయణ నామ సంకీర్తన నిరంతరాయంగా జరుగుతుంది. సాయంత్రం 4 గంటల వరకు స్వామి వారి నగరోత్సవం జరుగుతుంది. బుధవారం శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి భక్త బృందంతో స్వామి సంకీర్తనలు జరుగుతాయి. గురువారం ఉదయం 5 గంటలకు స్వామి మూలవిరాట్‌కు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ధుని పూజ ఆలయ అర్చక స్వాములు వేద పురోహితులు నిర్వహిస్తారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి అన్నప్రసాద వితరణ జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటల 53 నిమిషాలకు స్వామి వారికి ప్రత్యేక హారతి ఉంది. ఆగస్టు 23 మంగళవారం నుంచి ఆగస్టు 29 మంగళవారం వరకు ప్రతిరోజు సాయంత్రం 6:30 నుంచి రాత్రి 9 గంటల వరకు భరద్వాజ మాస్టర్ వారి పుత్రిక అడిదం వేదవతి వారిచే గురు చరిత్ర ప్రవచనాలు జరుగుతాయని కమిటీ సభ్యులు సాంబశివరావు తెలిపారు.

పాత్రికేయుడు కృష్ణారావు సేవలు మరువలేనివి



కృష్ణారావుకు నివాళులర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

ఒంగోలు సిటీ: తెలుగు, ఇంగ్లిష్ జర్నలిజంలో సీహెచ్‌వీఎం కృష్ణారావు చేసిన సేవలు మరువలేనివని డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఒంగోలు ప్రెస్‌క్లబ్‌లో డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో వివిధ పత్రికల్లో బ్యూరో చీఫ్ స్థాయిల్లో పనిచేసి ఇటీవల మరణించిన కృష్ణారావు సంస్మరణ సభ సోమవారం జరిగింది. కార్యక్రమానికి డీజేఎఫ్ ఒంగోలు డివిజన్ కార్యదర్శి గద్దల శివాజీ అధ్యక్షత వహించారు. 1975లో స్ట్రింగర్‌గా జీవితాన్ని ప్రారంభించిన కృష్ణారావు చీఫ్ ఆఫ్ న్యూస్ బ్యూరో స్థాయికి ఎదిగారన్నారు. ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, డెక్కన్ క్రానికల్, ద న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ వంటి తెలుగు, ఇంగ్లిష్ పత్రికల్లో సవ్యసాచిలాంటి వారన్నారు. డెక్కన్ క్రానికల్‌లో 18 ఏళ్ల పాటు పనిచేసిప రాజకీయాలకు కొమ్ముకాయకుండా టీవీ మాధ్యమంలో నిబద్ధ విశ్లేషకుడిగా విజ్ఞానదాయకమైన విశ్లేషణలు చేసేవాడన్నారు. తొలుత కృష్ణారావుకు నివాళిగా జర్నలిస్టులు కొద్దిసేపు మౌనం పాటించారు. జర్నలిస్ట్ ఫోరం ప్రతినిధులు నూకతోటి రవికుమార్, సీనియర్ జర్నలిస్ట్ బ్రహ్మానాయుడు, బొడ్డు శ్రీనివాసరావు, సురేంద్ర, ఉబ్బా అశోక్, ఎల్.రాజు, భరత్, ఫోరం సాంస్కృతిక ప్రతినిధి నూకతోటి శరత్‌బాబు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన తుఫాన్ బిల్డింగ్

కొత్తపట్నం: మండలంలోని సంకువారిగుంటలో ఉన్న తుఫాన్ బిల్డింగ్ శిథిలావస్థకు చేరి ప్రమాదం జరిగే పరిస్థితి నెలకొందని ఆ స్థానంలో కొత్త బిల్డింగ్ నిర్మించాలని ఎస్సీలు, హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ టీమ్ సభ్యులు మండలంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావుకు వినతపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుగ్గిరాల విజయ్‌కుమార్ మాట్లాడుతూ సంకువారిగుంటలో 150 కుటుంబాలు నివసిస్తున్నాయని, అంతా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారని, తుఫాన్లు వచ్చినప్పుడు తుఫాన్ బిల్డింగ్‌లోకి వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారని తహసీల్దార్‌కు వివరించారు. ఆ స్థానంలో కొత్త బిల్డింగ్ లేక మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. శ్లాబ్‌పై నుంచి పెచ్చులు ఊడి మనుషుల పడి ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. తహసీల్దార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడ తుఫాన్ బిల్డింగ్ ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

గిద్దలూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం అర్ధరాత్రి పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి గంగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మహ్మద్‌బాష అనే వ్యక్తి గిద్దలూరు ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యం కొనుగోలు చేసి గిద్దలూరు నుంచి యర్రగొండపాలెం తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న అధికారులు ఆటోలో వెళ్తున్న 29 బస్తాల వాహనాన్ని గుర్తించారు. బియ్యం బస్తాలను గోదాంకు తరలించారు. అనంతరం వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. మహ్మద్‌బాషా అనే వ్యక్తిపై 6 ఏ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

24 నుంచి పశువుల సంత పునఃప్రారంభం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు

చీమకుర్తి: సంతనూతలపాడులోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ప్రాంగణంలోని పశువుల సంతను ఈనెల 24 నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు తెలిపారు. సోమవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. కరోనా కాలంలో మూతపడిన పశువుల సంతను తిరిగి ప్రారంభించటం వలన అనేక మంది పశుపోషకులకు దోహదపడుతుందన్నారు. మార్కెట్ కమిటీ ఆదాయం 2022-23 ఆర్థిక సంవత్సరానికి టార్గెట్ రూ.3.50 కోట్లుగా రూ.4.50 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సారానికి రూ.4.52 కోట్లుగా టార్గెట్‌గా నిర్ణయించగా ఇప్పటికే రూ.1.32 కోట్లు రాబట్టగలిగినట్లు బంగారుబాబు తెలిపారు. మార్కెట్ కమిటీ ద్వారా కందులు, శనగలు, సుబాబులు వంటి వాటిపై సెస్ వసూళ్లు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి దానమ్మ, అసిస్టెంట్ సెక్రటరీ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్విస్ విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ మురళి

ఒంగోలు: స్థానిక క్విస్ కాలేజీలో విద్యార్థులకు సోమవారం ఓటు హక్కుపై జరిగిన అవగాహన సదస్సుకు ఒంగోలు తహసీల్దార్ మురళి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. ఓటు అనేది వజ్రాయుధం వంటిదని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు పొందడంతో పాటు దాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. కళాశాల చైర్మన్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులు సమకాలీన ప్రజాస్వామ్యంపై పూర్తి అవగాహన కలిగి ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో అజిత, శ్రీనివాసరావు, కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు, స్టూడెంట్ డీన్ డాక్టర్ ఎ.వాసుబాబు పర్యవేక్షించారు.

సంగమేశ్వర ఆలయంలో పూజలు



పూజలందుకుంటున్న శివలింగం

కొనకనమిట్ల: శ్రావణ మాసం నాగ పంచమి సోమవారం సందర్భంగా మండలంలోని ఎదుర్రాళ్లపాడులో గంగాపార్వతి సమేత సంగమేశ్వర స్వామి ఆలయం, బ్రాహ్మణపల్లి కాశీవిశ్వేశ్వర ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు నిర్వహించారు. సంగమేశ్వరస్వామి, పార్వతీదేవి, వినాయకస్వామి, నందీశ్వరులకు ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ పూజలు చేశారు. స్వామివారికి వెంకటబ్రహ్మయ్య, ఈశ్వరిదేవి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. బ్రాహ్మణపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని శివలింగానికి నూతనంగా నాగపడగను ఏర్పాటు చేసి అలంకరించారు. అర్చకులు శేఖరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సచివాలయ కన్వీనర్లకు ఉచిత ప్రమాద బీమా



సమావేశంలో పాల్గొన్న సచివాలయ కన్వీనర్లు

చీమకుర్తి: సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులకు ఉచిత ప్రమాద బీమాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కల్పించినట్లు జేసీఎస్ కన్వీనర్ కుమ్మూరి సుధాకర్ తెలిపారు. సోమవారం సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయి సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులతో ఒంగోలులోని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ పార్టీ కల్పించిన ఈ సదవకాశాన్ని పార్టీ కోసం పనిచేసే సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్లు కుమ్మూరి సుధాకర్‌తో పాటు దుంపా యలమందారెడ్డి, బత్తుల శ్రీను పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్న చెన్నకేశవ స్వామి మాస కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామిపేటలో వేంచేసియున్న ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో సోమవారం చిత్తా నక్షత్రం సందర్భంగా రాత్రి ఏడు గంటలకు ప్రసన్న చెన్నకేశవ స్వామి మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవ ఉభయదాతలుగా ఈడీ ప్రసాద్ దంపతులు, ఎస్.శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, కార్యనిర్వాహణాధికారి డి.రజనికుమారి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామి అమ్మవార్ల కల్యాణ క్రతువును దేవస్థాన అర్చక స్వాములు శర్మావధాని, పి.రామనాథాచార్యులు, నాగార్జునదేవ్, రాంబాబు, శ్రీధర్ నిర్వహించారు.

అట్రాసిటీ కేసు నమోదు

గిద్దలూరు రూరల్: మండలంలోని కంచిపల్లె గ్రామానికి చెందిన కళ్యాణ్ అనే వ్యక్తిని రాజుపేటకు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ కులం పేరుతో దూషించినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బైక్‌పై వెళ్తున్న చంద్రశేఖర్‌ను కళ్యాణ్ అనే వ్యక్తి గ్రామంలో బైక్ స్పీడుగా ఎందుకు వెళ్తున్నావని ప్రశ్నించడంతో వారి ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. ఈ నేపథ్యంలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

రైతులకు మేలు చేసేందుకు కృషి

- వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన షకీలా



బాధ్యతలు స్వీకరిస్తున్న షకీలా

దర్శి: వ్యవసాయ మార్కెట్ మార్డు ద్వారా రైతులందరికీ మేలు చేసేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లో షకీలా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను మార్కెట్ యార్డ్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. షకీలా మాట్లాడుతూ అందరి సలహాలు సూచనలతో మార్కెట్ యార్డ్‌ను విజయపథంలో నడిపిస్తామని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లలో కూడా రిజర్వేషన్‌లు పెట్టి ముస్లిం మహిళకు మార్కెట్ మార్డ్ చైర్మన్ పదవి తొలిసారి ఇవ్వడం హర్షణీయమన్నారు. ఈ అవకాశం కల్పించిన సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి ,షేక్ అమీన్ బాషా, సెక్రటరీ ఎఫ్ఏసీ తుమ్మలపూడి మస్తాన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నాగపంచమి వేడుకలు



ప్రత్యేక అలంకరనలో నాగదేవతల విగ్రహాలు

మార్కాపురం రూరల్: మండలంలోని బోడపాడు గ్రామంలో సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నాగపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగదేవతల విగ్రహాలను ప్రత్యేకంగా అలకంరించి అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం మహిళలు, చిన్నారులతో కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశారు.

ప్రతి పంట ఈ-క్రాప్‌లో నమోదు తప్పనిసరి



ఈ-క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

చీరాల టౌన్: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలు, సబ్సిడీలను నేరుగా రైతులకు అందించేందుకే గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది.. రైతులు పండించే ప్రతి పంట ఈ పంటలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని తోటవారిపాలెంలో ఖరీఫ్ సీజన్‌లో ఈ-క్రాప్ నమోదును ప్రారంభించారు. గ్రామంలోని మహిళా రైతు గండూరి సరస్వతి పొలంలో ఆర్‌బీకే సిబ్బందితో కలిసి పంట నమోదును ప్రారంభించగా వ్యవసాయ సలహామండలి చైర్మన్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో రైతులు సాగు చేసే ప్రతీ పంట వివరాలు నమోదు చేయించుకోవాలని తద్వారా వరదలు, ప్రకృతి విపత్తుల సమయంలో రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ఆర్‌బీకేల ద్వారానే అందిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

జేసీబీ, ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల గుండ్లకమ్మ నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న జేసీబీ, ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ సుందరరామయ్య తెలిపారు. గుండ్లకమ్మ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో సోమవార సిబ్బందితో కలిసి దాడి చేశామని, దాడిలో ట్రాక్టర్‌కు ఇసుకను లోడ్ చేస్తున్న జెసిబిని, ఇసుక ట్రాక్టర్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొదటి నేరం కింద జేసీబీకి రూ.50 వేల జరిమానా, ట్రాక్టర్‌కు రూ.10 వేల వరకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్సై శ్రీధర్‌బాబు, సిబ్బంది ఉన్నారు.